సాక్షి నంద్యాల

I

ఆదివారం । 14 । జనవరి । 2024



రూ.1.10 లక్షల విరాళం

మద్దికెర: శ్రీరంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి పెరవలికి చెందిన లింగం ప్రభాకర్ రెడ్డి, రాజశ్రీ దంపతులు రూ.1.10 లక్షల విరాళాన్ని ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్‌కు శనివారం అందజేశారు.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: సంక్రాంతి సెలవులు రావడంతో శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి భక్తులు పోటెత్తారు. దీంతో శనివారం దర్శన క్యూలైన్లు కిటకిటలాడాయి.



కేసీకి 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి శనివారం విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రద్దీకి అనుగుణంగా బస్సులు



డిపో సిబ్బందితో మాట్లాడుతున్న మంజుల

డోన్ టౌన్: ప్రయాణికుల రద్దీ మేరకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ బోర్డు చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల అన్నారు. శనివారం ఆమె స్థానిక ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యారేజ్, బస్టాండ్‌ను పరిశీలిస్తూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులపై భారం మోపకుండా సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం పెంచేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట డిపో గ్యారేజ్ ఇన్‌చార్జ్ పుల్లయ్య, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జాన్‌మెజీస్, హెడ్‌కానిస్టేబుల్ రామమద్దయ్య తదితరులు ఉన్నారు.

25 నుంచి నీలకంఠేశ్వరుని ఉత్సవాలు

- 27న మహారథోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఈనెల 25 నుంచి నీలకంఠేశ్వరుని ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఆలయ ప్రధాన ధర్మకర్త మాచాని నాగరాజు ఆధ్వర్యంలో రథశాలలో ప్రత్యేక పూజలు చేసి మహారథాన్ని వెలుపలికి తీశారు. ఈ సందర్భంగా మాచాని నాగరాజు మాట్లాడుతూ.. అధికారుల సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ రాత్రి 9 నుంచి 12గంటల వరకు కళ్యాణోత్సవం, 26న రాత్రి ప్రభావళి మహోత్సవం ఉంటుందన్నారు. 27 తేదీ సాయంత్రం మహారథోత్సవం, 28న వ్యాహవళి మహోత్సవం, 29న సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు తీర్థావళి, వసంతోత్సవం ఉంటాయన్నారు.



స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

భృంగివాహనంపై శ్రీశైలేశుడు



హరిదాసు వేషధారణలో..

- శ్రీగిరిలో వైభవంగా కొనసాగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు
- భృంగివాహనాధీశులను దర్శించి తరించిన భక్తజనం
- నేడు చిన్నారులకు భోగిపండ్ల కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల రెండో రోజు నుంచి వాహనసేవలు మొదలయ్యాయి. శనివారం రాత్రి భ్రమరాంబా సమేత శ్రీశైల మల్లికార్జునుడు భృంగి భుజస్కందాలపై ఊరేగాడు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ భృంగి వాహనంపై ఆశీనులు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత భృంగివాహనాధీశులైన స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ ధ్వజస్తంభం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక హారతులను ఇచ్చారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, తప్పెట్లు, కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భృంగివాహనంలో ఆశీనులైన స్వామిఅమ్మవార్లను దర్శించడం వలన చేసే పనుల్లో ఏకాగ్రత లభిస్తుందని, పాపాలు హరించబడతాయని పండితులు వివరించారు. గ్రామోత్సవంలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లను పలువురు భక్తులు కన్నులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో దేవ స్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఏఈవో మోహన్, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహిళల కోలాటం



సాధువుల శంఖారావం

నేడు రావణవాహన సేవ..

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవారలు రావణవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లను రావణవాహనసేవలో ప్రత్యేకంగా అలంకరించి తదుపరి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని ఉదయం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉచితంగా సామూహిక భోగి పండ్ల కార్యక్రమం నిర్వహిస్తారు. 5 సంవత్సరాల వరకు వయస్సు కలిగిన చిన్నారులకు ఈ భోగిపండ్లు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



ఉత్సవంలో ఆకట్టుకున్న వృషభం

ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రోత్సాహకాలు

- రూ.8.81 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటలు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యానశాఖ ద్వారా మూడేళ్ల వరకు రాయితీ అందిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి పంటలకు పిచికారీ చేసే మెషిన్‌లు, తైవాన్ స్ప్రేలు, కలుపు తీసే యంత్రాలు కొనుగోలు చేసి ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తామన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలో పండ్ల తోటల రైతులకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరేలా అన్ని రకాల పథకాల అమలుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ.8.81 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా 33 రకాల పథకాలతో కార్యాచరణను జగన్ సర్కార్ అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 40కి పైగా ఉద్యాన తోటలు సాగులో ఉన్నాయని, దీంతో జిల్లాకు పథకాలు, బడ్జెట్ అధికంగా కేటాయించాల్సి వస్తోందని వివరించారు. ఆయా పథకాల్లో భాగంగా చిన్నపాటి నర్సరీల ఏర్పాటుకు రూ.22.50 లక్షలు, కొత్తగా పండ్ల తోటల విస్తరణకు రూ.125.83 లక్షలు, హైబ్రీడ్ కూరగాయలకు రూ.24 లక్షలు, శాశ్వత పందిర్లు రూ.2.50 లక్షలు, నిర్వహణ ఖర్చులు రూ.12.04 లక్షలు, పుట్టగొడుగుల పెంపకం రూ.8 లక్షలు, కమ్యూనిటీ ఫారం పాండ్లు రూ.20 లక్షలు, వ్యక్తిగత ఫారం పాండ్లు రూ.10.50 లక్షలు, పాలీహౌస్-రూ.8.90 లక్షలు, షేడ్‌నెట్ హౌస్ రూ.49.70 లక్షలు, ప్లాస్టిక్ మల్చింగ్ రూ.33.60 లక్షలు, యాంటీ బర్డ్ నెస్ట్ ఏర్పాటు రూ.3.32 లక్షలు, ప్యాక్ హౌస్‌లు రూ.216 లక్షలు, ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ రూ.10 లక్షలు, రైపనింగ్ ఛాంబర్ రూ.21 లక్షలు, ఉల్లి నిల్వ గోదాములు రూ.175 లక్షలు, కోల్డ్ రూమ్‌లు రూ.63 లక్షలు, కలెక్షన్ సెంటర్లు రూ.150 లక్షలు, తేనెటీగల పెంపకం రూ.3.52 లక్షలు, మినీ ట్రాక్టర్లు రూ.15 లక్షలు, తైవాన్ స్ప్రేయర్లు రూ.12 లక్షలు, పవర్ టిల్లర్లు రూ.3.20 లక్షలు, శిక్షణా కార్యక్రమాలకు రూ.21.31 లక్షలు, రైతు ఉత్పత్తిదారులకు రూ.22 లక్షలు వెరసి రూ.8.81 కోట్ల బడ్జెట్‌తో అన్నదాతలకు చేయూతనిస్తున్నట్లు తెలిపారు.

90 శాతం ఈ - క్రాప్ నమోదు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా రబీలో సాగైన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు 90 శాతం పూర్తయినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 4,47,361 ఎకరాలకు గాను 2,78,896 ఎకరాల్లో పలు పంటలను అన్నదాతలు సాగు చేశారన్నారు. సాగైన విస్తీర్ణంలో ఈ నెల 12 వరకు 2,51,362 ఎకరాల పంట నమోదు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. పంట నమోదు జరిగిన 20,281 మంది రైతులకు సంబంధించి 74,528 ఎకరాలకు ఈ-కేవైసీ ప్రక్రియను సైతం పూర్తి చేసినట్లు చెప్పుకొచ్చారు. వ్యవసాయ సహాయకుల వద్ద ప్రక్రియను పూర్తి చేసిన 1,36,017 మంది, వీఆర్వో అథంటికేషన్ పూర్తి చేసుకున్న 1,22,275 మంది అన్నదాతలు త్వరితగతిన ఈ-కేవైసీ ప్రక్రియను దగ్గరుండి చేయించుకోవాలని సూచించారు.

శ్రీశైలం డ్యామ్ నీటి మట్టం 47 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శనివారం సాయంత్రానికి 47.1346 టీఎంసీలకు నీటి నిల్వలు చేరుకున్నాయి. జలాశయానికి ఎటువంటి వరద ప్రవాహం ఎగువ ప్రాంతాల నుంచి లేకపోయినప్పటికీ దిగువ ప్రాంతాలకు నిరంతరం నీటిని విడుదల చేస్తుండడం వలన జలాశయంలో నీటి నిల్వలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. శుక్రవారం నుంచి శనివారం వరకు జలాశయం నుంచి 4,193 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో నిరంతరం విద్యుత్ ఉత్పాదన జరుగుతూనే ఉంది. శుక్రవారం నుంచి శనివారం వరకు ఎడమగట్టు కేంద్రంలో 0.382 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 809 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు.

అంబేడ్కర్ స్ఫూర్తితోనే జగన్ సంక్షేమ పాలన

- విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేద్దాం
- ఇంగ్లిష్ మీడియం విద్య దళిత, గిరిజన విద్యార్థులకే ఎక్కువ ఉపయోగకరం
- అభివృద్ధి విరోధి చంద్రబాబు నాయుడు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న దళిత గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీఓస్ నాయకులు

నంద్యాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారని దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అన్ని రంగాల్లో సామాజిక న్యాయమంటూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. విజయవాడలో ఈనెల 19వ తేదీన జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా శనివారం పట్టణంలోని రామకృష్ణ కళాశాల ఆడిటోరియంలో రాజకీయ పార్టీలకు అతీతంగా జిల్లాలోని దళిత, గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగులు రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లింగస్వామి మాట్లాడుతూ విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా 210 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. 19 ఎకరాల స్థలంలో రూ.400 కోట్లతో 125 అడుగుల అంబేడ్కర్, 85 అడుగుల పాదపీటం, మొత్తం విగ్రహం ఎత్తు 210 అడుగులు ఏర్పాటు చేయడమే కాకుండా అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేయడం అద్భుతమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అద్భుత కళాఖండమన్నారు. ఈనెల 19వ తేదీన జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేసేందుకు లక్షలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సీఎం జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అన్ని రంగాల్లో న్యాయం చేస్తూ సామాజిక న్యాయం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ విశ్రాంత శాస్త్రవేత్త ఎల్.నాగభూషణం, బంజార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలునాయక్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బెల్లం రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సర్వయ్య, నంద్యాల మూడవ అదనపు సెషన్స్ కోర్టు ఏపీపీ తిరుపతి, ఎన్‌జీఓ సంఘం నాయకుడు రామారావు, దళిత, గిరిజన సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ నాయక్, మల్లేష్ నాయక్, భానుమూర్తి, రాజ్‌కుమార్, నడిపి చింతలన్న, కిరణ్ కుమార్, దేవదాస్, జయరాముడు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, మునిస్వామి, శివ, సి.మద్దిలేటి, సుందర్‌రావు, సుధాకర్, విజయ్, ఎర్రన్న పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలకే పరిమితం



గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు అమరావతిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పడమే కాకుండా రూ.250 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు జీవో తెచ్చారు. కాని అక్కడ పునాదులు కూడా పడలేదు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పడమే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి చూపించారు. విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు భారీగా తరలి వెళ్లి సభను విజయవంతం చేస్తాం. **- లక్ష్మణ్‌నాయక్, ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి, నంద్యాల**

జగన్ చరిత్రలో నిలిచిపోతారు



దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. అంబేడ్కర్ అందరి వాడు. అలాంటి మహానుబావుడికి రూ.400 కోట్లతో విగ్రహాన్ని, స్మృతివనం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కులమతాలకు అతీతంగా ఈనెల 19వ తేదీన విజయవాడకు లక్షలాదిగా తరలి రావాలి.

- నాగభూషణం, ఐఆర్‌ఎస్ విశ్రాంత శాస్త్రవేత్త, నంద్యాల

ఇంగ్లిష్ మీడియం ప్రయోజనకరం



ఇంగ్లిష్ మీడియం విద్య కేవలం రాజకీయ నాయకుల పిల్లలు, ధనవంతుల పిల్లలు మాత్రమే చదివేవారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు సైతం ఇంగ్లిష్ మీడియంలో విద్య అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఎక్కువగా వెళ్లేది దళిత గిరిజనుల పిల్లలే. ఇంగ్లిష్ మీడియం విద్య ఎక్కువగా మన పిల్లలకే ఉపయోగపడుతుంది. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇంగ్లిష్ మీడియం విద్యను ఎందుకు వద్దంటున్నారో అర్థం చేసుకోవాలి.

- బెల్లం రాజ్‌కుమార్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, నంద్యాల

విద్యకు అధిక ప్రాధాన్యత అభినందనీయం



దళిత, గిరిజనుల పిల్లలు నేడు పాఠశాలకు వెళ్తున్నారంటే అది సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చర్యలే. విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు ఇవ్వడమే కాకుండా ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌లు అన్ని ఉచితంగా అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు.

- ఆవుల మునిస్వామి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకుడు, నంద్యాల

ఆర్టీఓ అధికారులమంటూ హల్‌చల్

● ముగ్గురు యువకుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వెంకట్రాయమయ్య

ఆళ్లగడ్డ: ముగ్గురు యువకులు విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు సులువుగా డబ్బు సంపాదించే పనిలో నకిలీ ఆర్టీఓ అధికారుల అవతారమెత్తారు.. వాహనాదారుల నుంచి అక్రమంగా వసూలు చేసి జల్సాలు చేసేవారు. చివరకు పోలీసులకు చిక్కి జైలు పాలయ్యారు. నిందితుల వివరాలను శనివారం డీఎస్పీ వెంకట్రాయమయ్య మీడియాకు వివరించారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఆరే విల్సన్‌కుమార్, దూదేకుల హుస్సేనయ్య, సగబాలి చిన్న వెంకటేశ్వర్లు ఆర్టీఓ అధికారులుగా చెప్పుకుంటూ ఓ వాహనానికి ప్రభుత్వ వాహనం స్టిక్కర్ అతికించుకుని జాతీయ రహదారిపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేసేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఓ వాహనదారుడిని రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో అతనిపై చేయిచేసుకున్నారు. అనుమానం వచ్చిన వాహన డ్రైవర్ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి సంఘటన స్థలికి వెళ్లడంతో పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ వాహనంగా ఉపయోగిస్తున్న కారు, రెండు సెల్ ఫోన్‌లు సీజ్ చేసి వారి నుంచి రూ. 2,200 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలానరసింహుడు, ప్రహ్లాదవరదుడు

భక్తుని చెంతకే భగవంతుడు

● ఈ నెల 16 నుంచి అహోబిలేశుని పార్వేట మహోత్సవాలు
● 33 గ్రామాల్లో 46 రోజుల పర్యటించనున్న శ్రీ జ్వాలా నృసింహుడు, ప్రహ్లాదవరద స్వామి
● ముస్తాబవుతున్న గ్రామాలు, తెలవులు
● బంధు మిత్రులతో కళకళలాడనున్న పల్లెలు

రారండోయ్ భక్తుల్లారా నా పెళ్లికి అంటూ.. అహోబిలేశుడే స్వయంగా భక్తుల గుమ్మం దగ్గరకు రావాలంటే ఎంతో అదృష్టం ఉండాలి. ఎక్కడో కొలువైన తమ ఇష్టదైవం నేరుగా గ్రామాల్లోని వాడవాడల్లో సంచరిస్తూ ఆశీర్వచనాలు అందించాలంటే ఎన్నోజన్మల పుణ్యం చేసుకోవాలి. ఇంతటి మహాభాగ్యం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల ప్రజలకు ఏటా దక్కుతోంది. సంక్రాంతి పర్వదినం మూడో రోజు నుంచి అహోబిలేశుడి 'పార్వేట'కు బయలుదేరి భక్తుల మధ్యనే 46 రోజులు పర్యటిస్తారు. ఈ నెల 16 నుంచి అహోబిలేశుడి పార్వేట మహోత్సవాలు ప్రారంభవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.



దిగువ అహోబిల దేవాలయం



పల్లెకు బయలు దేరుతున్న ఉత్సవ పల్లకీ(ఫైల్)

ఆళ్లగడ్డ: నల్లమల అడవిలో అహోబిల క్షేత్రం కొలువై ఉంది. ఎగువ క్షేత్రంలో శ్రీ జ్వాలానరసింహ స్వామి, దిగువలో శ్రీ ప్రహ్లాదవరద స్వామి పూజలు అందుకుంటున్నారు. క్షేత్ర నిర్వహణ శతాబ్దాలుగా అహోబిల మఠం ఆధ్వర్యంలో ఉంది. కర్ణాటక రాష్ట్రం మేల్కోటిలో జన్మించిన కిడాంబి చక్లపిళ్లై శ్రీనివాసాచార్యులు కాంచీపురంలో వేదాంత కాలక్షేపం చేస్తున్న సమయంలో కలలో నరసింహస్వామి సాక్షాత్కరించి అహోబిలం రావాలని తెలిపి అదృశ్యమయ్యాడు. స్వామి మాట ప్రకారం శ్రీనివాసాచార్యులు అహోబిలం చేరుకోగానే నరసింహస్వామి వృద్ధ సన్యాసి రూపంలో దర్శనమిచ్చి అనుగ్రహించారు. సాక్షాత్తూ నరసింహస్వామి చేతుల మీదుగా సన్యాసాన్ని స్వీకరించిన శ్రీనివాసాచార్యులు 'ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్' అనే సన్యాస నామాన్ని స్వీకరించి అహోబిల మఠాన్ని స్థాపించి శ్రీ అహోబిలర్ మొదటి పీఠాధిపతిగా వినుతికెక్కారు. అ సమయంలో అహోబిలేశుడు పీఠాధిపతులతో గ్రామే గ్రామే చగత్వాపద చరణ యో.. మాంగృహీత్వ (గ్రామ గ్రామాలకు నన్ను వేంచింపజేసి జనలకు మోక్ష మార్గాన్ని ఉపదేశించండి) అన్నారు. స్వామి ఆజ్ఞ మేరకు ప్రప్రథమ పీఠాధిపతి స్వామిని గ్రామ గ్రామాలకు ఊరేగింపుగా తీసుకెళ్లే 'పార్వేట' ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సంప్రదాయం ప్రకారం ఏటా సంక్రాంతి పర్వదినం రోజు ఎగువ అహోబిలంలో కొలువైన శ్రీ జ్వాల నరసింహస్వామిని దిగువ అహోబిలం తోడ్కొని వచ్చి కొలువుంచుతారు. కనుమ రోజు శ్రీ ప్రహ్లాదవరద స్వామితో కలిపి కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఉత్సవమూర్తుల ఎదుట అన్నకూటోత్సవం నిర్వహిస్తారు. అనంతరం తమ వివాహ మహోత్సవ (బ్రహ్మోత్సవ) వేడుకలకు భక్తలను ఆహ్వానించేందుకు స్వాములు ఇద్దరూ ప్రత్యేకంగా అలంకరించిన ఒకే పల్లకీలో కొలువై బయలు దేరుతారు. పార్వేట మహోత్సవాల్లో ఒంటరిగా తలకు తలపాగా మాత్రమే కట్టుకుని ఒక చేత్తో కత్తి ధరించి వేటగాడి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు.

పార్వేట అంటే..

''పరి'' అంటే గుర్రం.. 'పార్వేట' అంటే గుర్రంపై స్వారీ చేస్తూ వేటాడటం అని అర్థం. ప్రతి వైష్ణవ క్షేత్రాల్లో ఏటా ఈ ఉత్సవం జరుగుతుంది. ఎక్కడైనా పార్వేట ఒక్క రోజే ఉదయం నుంచి రాత్రి లోపు ముగుస్తుంది. ఒక్క అహోబిలేశుడి పార్వేట మాత్రమే 46 రోజులపాటు జరగడం విశేషం. స్వామి తిరిగి కొండ చేరే వరకు అహోబిలంలో మూలవిరాట్‌ను దర్శించుకునే భక్తులకు శఠారు పెట్టరు. కేవలం తీర్థం మాత్రమే అందజేయడం ఆనవాయితీగా వస్తోంది.

అన్నమయ్య కీర్తనల్లో ప్రస్తావన

ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమయ్యకు అహోబిలం క్షేత్రానికి అవినాభావ సంబంధం ఉంది. అహోబిల ప్రథమ పీఠాధిపతి దగ్గర అన్నమయ్య శిష్యరికం చేశారు. 12 ఏళ్లపాటు ఆయన అహోబిలంలో నివాసం ఉండి నారసింహుడిపై వేలాది కీర్తనాలు రచించారు. అందులో 'దేవ శిఖామణి దివిజుల వొండగంగ వేవేల గతులు వెలసీ వాడే' (నరసింహ స్వామి గుర్రంపై వీధి వీధిన తిరుగుతూ తన పెళ్లికి భక్తులు అందించే సారెను స్వీకరిస్తాడని) అంటూ ఓ కీర్తనలో పారువేట ఉత్సవాలను ప్రస్తావించారు.

సంప్రదాయ కళలకు జీవం

పార్వేట 46 రోజుల పాటు 33 గ్రామల్లో సాగుతుంది. ఆయా గ్రామాల్లో స్వామికి నేటికి అర్చకులు బావి నీరు మాత్రమే తెచ్చి కట్టెల పొయ్యిపై వండిన నైవేద్యాన్ని మాత్రమే నివేదిస్తారు. ఉత్సవ పల్లకీ ఏగ్రామానికి వెళితే అక్కడ స్వామి ఉన్నన్ని రోజులు జానపద, పౌరాణిక నాటకాలు, హరి కథలు, బుర్ర కథలు ప్రదర్శిస్తారు. ఆధునిక కంప్యూటర్ యుగంలో కూడా సంప్రదాయ కళలకు పార్వేట ఉత్సవాలు జీవం పోస్తున్నాయి.

ఎంతో పుణ్యం చేసుకోవాలి



ప్రపంచంలో ఏ దేవుడు ఇవ్వని కానుక అహోబిలేశుడు పార్వేట ఉత్సవాల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అందిస్తారు. స్వయంగా భగవంతుడే భక్తుని చెంతకు వెళ్లి దర్శన భాగ్యం కల్పించే కార్యక్రమానికి ఉత్సవాలు వేదికగా నిలుస్తాయి. భక్తులు ఎంతో పుణ్యం చేసుకుంటేనే కాని దేవుడే తమ దగ్గరకు వచ్చి ఆశీర్వదించే వరం దక్కదు.

– కిడాంబి వేణుగోపాలన్, ప్రధానార్చకులు

ఏడాది పొడువునా ఎదురుచూస్తాం



చెంతకు వచ్చే స్వామిని దర్శించుకోవడం చెప్పలేని ఆనందాన్నిస్తుంది. స్వామి వచ్చి దర్శనమిచ్చిన అనంతరం మళ్లీ వచ్చే ఏడాది పార్వేట పల్లకీ వచ్చేవరకు ఎదురు చూస్తూనే ఉంటాం. స్వామిని ఘనంగా స్వాగతిస్తూ పార్వేట ఉత్సవాలు జరుపుకుంటాం.

– షేక్ నజీర్‌హుస్సేన్, ఆళ్లగడ్డ

ఆర్టీసీ బస్సు డ్రైవర్ దుర్మరణం

కర్నూలు: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో అనంతపురం జిల్లా అమ్మవారిపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ అంజనేయులు (49) మృతి చెందాడు. బస్సులోని 14 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి 44వ జాతీయ రహదారిలో ఉలిందకొండ ఫ్లై ఓవర్ పక్కన చోటుచేసుకుంది. కళ్యాణదుర్గం నుంచి శ్రీశైలానికి 54 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ వడ్డె మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు.

మల్లన్న సేవలో హైకోర్టు జడ్జి



స్వామిఅమ్మవార్ల దర్శనానికి వస్తున్న జస్టిస్ యు. దుర్గాప్రసాద్‌రావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జ్ జస్టిస్ యు. దుర్గాప్రసాద్‌రావు శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

బాబు ష్యూరిటీ అంతా బూటకం



బుగ్గానిపల్లెలో ప్రసంగిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

● టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దు
● మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబు నాయుడు అధికారం కోసం ప్రజలను మోసం చేయడానికి మరోసారి సిద్ధంగా ఉన్నాడని, బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ అంతా బూటకమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం బేతంచెర్ల నగర పంచాయతీలోని బుగ్గానిపల్లె గ్రామంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు, అసైన్డ్ భూములకు శాశ్వత భూ హక్కు పత్రాలను మంత్రి బుగ్గన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. 2014 ఎన్నికల ముందు పొదుపు మహిళలు, రైతు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారన్నారు. మాట మీద నిలబడని వ్యక్తి భవిష్యత్తుకు గ్యారంటీ అని హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. తెలుగు దేశం పార్టీలో అధినేత నుంచి డోన్ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి వరకు మోసపూరిత హామీలతో ప్రజల ముందుకు వస్తారని, వారి మాయమాటలు నమ్మొద్దన్నారు. దేవుడు ఆశీస్సులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండతో నియోజకవర్గంలో 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలోనే చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కనుమ కింది కొట్టాల వద్ద రూ. 2.50 కోట్లతో బిల్లస్వర్గం గుహలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మద్దిలేటిస్వామి ఆలయాన్ని రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మూత బడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి, చెడును గుర్తించి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తనను ఆశీర్వదించాలని మంత్రి బుగ్గన ప్రజలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, బలరామిరెడ్డి, గుని నాగరాజు, మధు, మద్దయ్య, రాముడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు మధు, చింతల నాగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు 'నవోదయ'ం

● ఈనెల 20న ప్రవేశ పరీక్ష
● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలు
● సీటు సాధిస్తే 7 సంవత్సరాల పాటు ఉచిత విద్యాబోధన



బనవాసి నవోదయ విద్యాలయం ప్రాంగణం

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ.. ఉత్తమ విద్యా బోధన అందిస్తూ ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం పేరు గాంచింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో దీనిని స్థాపించారు. 2023- 2024 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి 6,120 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈ నెల 20వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఇందు కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.దరఖాస్తు చేసుకున్నవిద్యార్థులు హాల్‌టికెట్స్‌ను https:// cbseitms. rcil.gov.in/ nvs/AdminCard /AdminCard వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మొత్తం 80 సీట్లు

నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో సీటు సాధిస్తే ఏడు సంవత్సరాల పాటు ఉచిత విద్య అందుతుంది. బనవాసి జవహర్ నవోదయ విద్యాల యంలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలికలకు 30 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, 20 సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు.

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు

నవోదయ విద్యాలయంలో సీబీఎస్ఈ కూడిన అత్యుత్తమ విద్యా బోధన అందిస్తారు. నిపుణులైన అధ్యాపకలు బోధిస్తారు. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, అధునాత కంప్యూటర్ ల్యాబ్, పోషక విలువలతో కూడిన ఆహారం, మానసికోల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు నవోదయ విద్యాలయ ప్రత్యేకతలు. సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ నవోదయాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

☛ పరీక్ష విధానం ఇదీ..

నవోదయ ప్రవేశ పరీక్ష 100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి. సమయం రెండు గంటలు. దివ్యాంగులకు అదనంగా 40 నిమిషాలు సమయం ఇస్తారు. మేధాశక్తిని పరీక్షించేందుకు 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితంలో ప్రతిభను తెలుసుకునేందుకు 25 మార్కులకు 20 ప్రశ్నలు, భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు 25 మార్కులకు 20 ప్రశ్నలు ఇస్తారు.

అత్యుత్తమ ప్రమాణాలు

విద్యాలయంలో అత్యుత్తమ విద్యాప్రమాణాలు ఉన్నాయి. విద్యార్థుల సర్వోతోముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యాలయంలో కేరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. న్యూట్రీషియన్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలామంది ఉన్నత స్థాయిలో ఉన్నారు.

– పద్మావతి, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

రేపు పోలీసు స్పందన రద్దు



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమం ఈ 15వ తేదీ సంక్రాంతి పర్వదినం సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఎవరైనా సంప్రదాయం, ఆచారం పేరుతో సమస్యలు, అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే డయల్ 100 లేదా 9154987020కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. జూదం, కోడి పందేలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.